నమస్తే తెలంగాణ
జోగులాంబ గద్వాల వనపర్తి
5 | మహబూబ్‌నగర్, మంగళవారం 29 ఏప్రిల్ 2025 | JOGULAMBA GADWAL WANAPARTHY

# రజతోత్సాహం



## అంచనాలకుమించి.. సభ గ్రాండ్ సక్సెస్

- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి



వనపర్తి టౌన్, ఏప్రిల్ 28: అంచనాలకు మించి బీఆర్ఎస్ రజతోత్సవ సభ విజయవంత మైందని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ 17 నెలలపాలన, వైఫల్యాలు, అబద్ధపు హామీలు, దౌర్జన్యాలకు చెంపపెట్టు రజతోత్సవ సభ అని చెప్పారు. 17 నెలల్లో తెలంగాణను అన్ని రంగాల్లో ఆగం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కేసీఆర్ ప్రశ్నించారని, అంశాలవారీగా వాటికి సమాధానం చెప్పలేని మంత్రులు కారుకూతలు కూస్తున్నారని.. కేసీఆర్‌పై చేసిన విమర్శలను వారి విజ్ఞప్తికే వదిలేస్తున్నామన్నారు. రజతోత్సవ సభతో యావత్ తెలంగాణ కేసీఆర్ వెన్నం టి ఉందని ప్రజలు గుర్తుచేశారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారాన్ని గుప్పిట్లో పెట్టుకొని సభ సజావుగా సాగకుండా ప్రజలు సభకు రాకుండా ఎన్ని అడ్డంకులు సృష్టించినా జనావాసాల ముందు వారి ఆటలు సాగలేదన్నారు. మండు టెండలను లెక్క చేయకుండా లక్షలాదిగా తరలి వచ్చిన తెలంగాణ, ఉమ్మడి పాలమూరు, వనపర్తి నియోజకవర్గ ప్రజలకు మాజీ మంత్రి కృతజ్ఞతలు చెప్పారు. వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేసిన ప్రజలు, నాయకులు, కార్యకర్తలు, నేతలు, అభిమానులందరికీ ధన్యవాదాలు తెలిపారు.

## గులాబీ జాతరకు వేలాదిగా వచ్చిండ్రు..

- పార్టీశ్రేణులకు కృతజ్ఞతలు
- మాజీ మంత్రి లక్ష్మారెడ్డి



జడ్చర్ల, ఏప్రిల్ 28: వరంగల్‌లోని ఎల్కతుర్తిలో ఆదివారం నిర్వహించిన బీఆర్ఎస్ రజతోత్సవ సభకు జడ్చర్ల నియోజకవర్గం నుంచి వేలాదిగా తరలివచ్చి సభను విజయవంతం చేసిన పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలకు మాజీ మంత్రి లక్ష్మారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఎంతో దూరం నుంచి అనేక ఇబ్బందులు పడుతూ కేసీఆర్ సభకు ఊహించని విధంగా ఉమ్మడి జిల్లా నుంచి కార్యకర్తలు, నాయకులు తరలివచ్చారు. వారందరికీ పార్టీ తరపున ధన్యవాదాలు. పార్టీ అధిష్టానం దూరం చాలా ఎక్కువ ఉన్నందున తక్కువ జన సమీకరణ చేపట్టాలని చెప్పినప్పటికీ నియోజకవర్గాల్లో వినలేదు.. కొంతమంది సొంతంగా వాహనాలు సమకూర్చుకొని వచ్చారు. వారందరికీ కూడా పార్టీ తరపున ప్రత్యేక కృతజ్ఞతలు. స్వచ్ఛందంగా తరలి వస్తున్న చాలామందిని పోలీసు యంత్రాంగం అడ్డుపెట్టి నిలిపివేసింది. అయినా కేసీఆర్‌పై ప్రేమతో చాలామంది కిలోమీటర్లు మేర నడుచుకుంటూ సభకు చేరుకున్నారు. మళ్లీ వాళ్లంతా క్షేమంగా ఇండ్లకు చేరేవరకు పార్టీ నాయకులతో సమన్వయం చేసుకున్నాం. ఎలాంటి ఇబ్బంది లేకుండా కార్యకర్తలు తిరిగి గమ్యస్థానాలకు చేరుకున్నారు. వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే.. స్థానిక సంస్థల ఎన్నికలు జరిపితే సత్తా ఏంటో చూపిస్తాం.

## రజతోత్సవంతో నూతనోత్సాహం

- వరంగల్ సభ దిగ్విజయం
- గులాబీ పార్టీ శ్రేణులకు ధన్యవాదాలు
- కాంగ్రెస్ మోసాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గువ్వల



అచ్చంపేట, ఏప్రిల్ 28: బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ రజతోత్సవ సభలో కాంగ్రెస్ చేసిన నయవంచన మోసాన్ని, అబద్ధాల హామీలు, మోసం తీరును ఎండగట్టిన విధానాన్ని పార్టీశ్రేణులు ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు పేర్కొన్నారు. ఆదివారం వరంగల్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ రజతోత్సవ సభకు నాగర్‌కర్నూల్ జిల్లా నుంచి తరలివచ్చి దిగ్విజయం చేసిన ప్రజానికానికి, సభ విజయవంతం కోసం కృషిచేసిన మాజీ ఎమ్మెల్యేలు మర్రి జనార్ధన్‌రెడ్డి, జైపాల్ యాదవ్, హర్షవర్ధన్‌రెడ్డికి సోమవారం ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. అబద్ధాల కాంగ్రెస్ చేసిన మోసాన్ని ప్రజలకు వివరించి వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చేవిధంగా కృషిచేయాలని పిలుపునిచ్చారు. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా వంచించి మోసం చేస్తున్న కాంగ్రెస్ విధానాన్ని పసిగట్టిన ప్రజలు తేరుకున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలే కాంగ్రెస్‌ను ఓడిస్తారన్నారు.

## కేసీఆర్ ఆదేశాలను పాటిస్తాం

- సభకు తరలొచ్చిన అందరికీ కృతజ్ఞతలు
- బాస్ స్పీచ్‌ను కోట్లాది మంది వీక్షించారు
- ప్రభుత్వ అసమర్థ వైఫల్యాలను తిప్పికొడతాం
- బీఆర్ఎస్ పేట జిల్లా అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి



నారాయణ పేట, ఏప్రిల్ 28: రజతోత్సవ సభలో మాజీ సీఎం, గులాబీ దళపతి కేసీఆర్ ఇచ్చిన ఆదేశాలను తూ.చ. తప్పకుండా పాటిస్తామని బీఆర్ఎస్ నారాయణపేట జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి అన్నారు. ఓరుగల్లుకు సభకు జిల్లా నలుమూలల నుంచి పెద్ద ఎత్తున విచ్చేసిన గులాబీ పార్టీ నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా వారియర్లు, అభిమానులు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ అసమర్థ పాలనను ఎప్పటికప్పుడు తిప్పికొడతామని, రాబోయే రోజుల్లో ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడుతామన్నారు. దేవుడి కృపతో చిన్నపాటి అవాంతరం లేకుండా దాదాపు 345 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఓరుగల్లుకు కార్యకర్తలు, నాయకులు క్షేమంగా వెళ్లి, క్షేమంగా రావడంపై ఈ సందర్భంగా దేవుడిని వేడుకున్నారు. ఈ సందర్భంగా ఇన్ని రోజులు గుర్తుకు రాని నిబంధనలు ఇప్పుడే గుర్తు కొచ్చినట్లు కాంగ్రెస్ నాయకులు పోలీసులను అడ్డుపెట్టుకొని సభకు వెళ్లే వాహనాలను అడ్డుకొనే ప్రయత్నం చేసినా.. సభ విజయవంత మైందన్నారు. ఎల్కతుర్తి బీఆర్ఎస్ రజతోత్సవ సభ కోసం ప్రపంచ స్థాయిలో ప్రజలు ఆసక్తి కనబరిచారని, ముఖ్యంగా కేసీఆర్ స్పీచ్ కోసం ప్రత్యక్షంగా 20లక్షల మంది, పరోక్షంగా ప్రపంచ స్థాయిలో కోట్లాది మంది టీవీల్లో వీక్షించారని పేర్కొన్నారు. వరంగల్ సభా వేదికగా కేసీఆర్ ఇచ్చిన ఆదేశాలను తూచ తప్పకుండా పాటిస్తామన్నారు.

- సభసక్సెస్‌తో పాలమూరు గులాబీలో జోష్
- ఉమ్మడి జిల్లా నుంచి భారీగా తరలిన శ్రేణులు
- ఏర్పాట్లు పరిశీలించిన మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, నేతలు
- సారు స్పీచ్‌కు అంతా ఫిదా..
- గ్రామాల్లో రచ్చకట్టల వద్ద సభపైనే చర్చ



మహబూబ్‌నగర్, ఏప్రిల్ 28 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): భారత రాష్ట్ర సమితి రజతోత్సవ సభకు ఉమ్మడి జిల్లా నుంచి పెద్ద ఎత్తున తరలి వెళ్లడం.. ఊహించిన దానికంటే వరంగల్ సభ సక్సెస్ కావడంతో పార్టీ శ్రేణుల్లో ఫుల్ జోష్ కనిపిస్తోంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా చాలా తక్కువ మందిని తరలించాలని రాష్ట్ర కమిటీ ఆదేశించినా.. అందుకు భిన్నంగా స్వచ్ఛందంగా సొంత వాహనాల్లో తరలివెళ్లారు. వరంగల్ సభకు వెళ్లి తిరిగి వచ్చే వరకు అలంపూర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు.. ఆయా నియోజకవర్గాల ఇన్‌చార్జీలతో టచ్‌లో ఉన్నారు. సోమవారం తెల్లవారుజామున గమ్య స్థానానికి చేరారు. సభ ముగిశాక అందరినీ పార్టీ నేతలు సమన్వయం చేశారు. మక్తల్ మండలంలోని అవుసలోనిపల్లి కార్యకర్తలకు కేటాయించిన ఆర్టీసీ బస్సు మొరాయించడంతో వరంగల్ శివారులో ఆగిపోయింది. మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి హుటాహుటిన అక్కడికెళ్లి వేరే బస్సులో వారిని తరలించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఊహించిన దానికంటే ఎక్కువ జనం తరలి వెళ్లడంతో పార్టీ నేతలు ఫుల్ జోష్‌లో ఉన్నారు. సోమవారం గ్రామాల్లో ఎక్కడ చూసినా కేసీఆర్ సభ, సార్ స్పీచ్‌పైనే చర్చించుకుంటున్నారు.

### ఊరూవాడ ఏకమై..

పార్టీ 25ఏళ్ల పండుగను వరంగల్‌లో నిర్వహిస్తే ఊరూవాడ ఏకమై సభకు ఊహించని జనం తరలివెళ్లారు. అనేక గ్రామాల్లో వాహనాలు పంపించాలని పార్టీ నేతలపై ఒత్తిడి తెచ్చారు. చివరకు చేసేదేమీ లేక చాలామందికి చివరి నిమిషంలో ప్రైవేట్ వాహనాలను అరేంజ్ చేయాల్సి వచ్చింది. మరి కొంత మంది సొంత వాహనాలను ఏర్పాటు చేసుకొని ముందస్తుగానే వరంగల్‌కు వెళ్లి పోయారు. కేసీఆర్ సభా ప్రాంగణానికి చేరుకొని అక్కడ వీడియోలు, ఫొటోలు స్థానిక సోషల్ మీడియా గ్రూపుల్లో షేర్ చేశారు. వరంగల్ సభకు రావడం జన్మ ధన్యమైందంటూ కొంతమంది కామెంట్లు పెట్టారు. కేసీఆర్ సభకు వెళ్లాలనే సంకల్పం తప్పా మిగతా ఏదీ కనిపించలేదని కొంతమంది కామెంట్లు చేశారు.

### పొద్దుపోయాక తిరిగి వచ్చిన కార్యకర్తలు

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి దాదాపు 350 కిలో మీటర్ల మేర ప్రయాణం చేసి బీఆర్ఎస్ రజతోత్సవ సభలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు తెల్లవారు జామున ఇండ్లకు చేరుకున్నారు. మాజీ మంత్రులు శ్రీనివాస్ గౌడ్, నిరంజన్ రెడ్డి, లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీలు చల్లా వెంకట్రామిరెడ్డి, నవీన్‌కుమార్, అలంపూర్ ఎమ్మెల్యే విజేయుడు, మాజీ ఎమ్మెల్యేలు చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, ఆల వెంకటేశ్వర్ రెడ్డి, రాజేందర్ రెడ్డి, గువ్వల బాలరాజు, మర్రి జనార్దన్ రెడ్డి, జైపాల్ యాదవ్, బీరం హర్షవర్ధన్ రెడ్డి, పట్నం నరేందర్ రెడ్డి ఇతర క్యాడర్ నేతలు ఆయా నియోజకవర్గాల నుంచి తరలివెళ్లిన వారు సురక్షితంగా ఇండ్లకు వచ్చేవరకు రాత్రంతా జాగరణ చేశారు.

### క్యాడర్లో ఫుల్ జోష్..

బీఆర్ఎస్ రజతోత్సవ సభ విజయవంతం కావడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కార్యకర్తలు పట్టలేని సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. వందల కిలోమీటర్లు ప్రయాణం చేసి కేసీఆర్ సభకు వెళ్లి తిరిగి వచ్చిన కార్యకర్తలు గ్రామాల్లో అక్కడ జరిగిన విశేషాలను వివరించడంతో ఎక్కడ చూసినా ఇదే చర్చ. మరోవైపు టీవీల్లో సెల్‌ఫోన్లలో కేసీఆర్ స్పీచ్‌ను విన్న జనం రచ్చకట్టల వద్ద జోరుగా చర్చించుకుంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టిన తీరును మాట్లాడుకోవడం కనిపించింది.

## కండక్టర్‌ను అభినందించిన ఆర్టీసీ ఎండీ

అచ్చంపేట, ఏప్రిల్ 28 : అచ్చంపేట డిపోకు చెందిన కండక్టర్ నిజాయితీ చాటుకోవడంతో ఆర్టీసీ ఎండీ సజ్జనార్ అభినందించారు. ఓ ప్రయాణికుడు ఈ నెల 26న హైదరాబాద్-అచ్చంపేట ఆర్టీసీ బస్సులో రూ. 13 లక్షల విలువ చేసే బంగారం, వెండి ఆభరణాలు, కొంత నగదును పోగొట్టుకున్నాడు. వాటిని సదరు ప్రయాణికుడిని పిలిపించి అందజేసిన అచ్చంపేట డిపోకు చెందిన కండక్టర్ వెంకటేశ్వర్లును సోమవారం హైదరాబాద్ బస్‌భవన్‌లో సజ్జనార్ సన్మానించారు.



కండక్టర్‌ను అభినందిస్తున్న ఆర్టీసీ ఎండీ సజ్జనార్

## ఇక కాంగ్రెస్‌ను బొందపెట్టుడే..

- అవినీతి పాలనపై ప్రజల తిరుగుబాటు
- మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

కొల్లాపూర్, ఏప్రిల్ 28: అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన అవినీతి కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల తిరుగుబాటు మొదలైందని మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. బీఆర్ఎస్ రజతోత్సవ సభకు కొల్లాపూర్ నియోజకవర్గం నుంచి ఆశేషంగా తరలివచ్చిన పార్టీ కార్యకర్తలు, నాయకులకు సోమవారం ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండేండ్ల కాలంలోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో అసంతృప్తి పెల్లుబికిందన్నారు. రాష్ట్రంలోని ఏ వర్గానికి కూడా ఒక్క సంక్షేమ పథకమైనా పూర్తి స్థాయిలో అమలు చేయలేదన్నారు. ఎవరూ ఊహించని విధంగా రజతోత్సవ సభకు కార్యకర్తలు లక్షలాదిగా తరలివచ్చినట్లు వెల్లడించారు. ఎన్నికలు ఎప్పుడు నిర్వహించిన కాంగ్రెస్ పార్టీని ప్రజలు బొందపెట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు అర్థమవుతోందన్నారు. భవిష్యత్ బీఆర్ఎస్‌దేనని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలందరూ కేసీఆర్ మళ్లా కావాలని అంటున్నారని చెప్పారు. పార్టీశ్రేణులు ధైర్యంగా ఉండాలని సూచించారు.



## మాతృమూర్తి మానవత్వం

- బ్రెయిన్ డెడ్‌తో ఆరుగురికి ప్రాణదానం



నర్సుబాయి(ఫైల్)

అలంపూర్ చౌరస్తా, ఏప్రిల్ 28: నేటి హైటెక్ సమాజంలో ఎవరి క్షేమైనా పట్టించుకోకుండా బిజీబిజీగా గడుపుతున్న ప్రజల మధ్య ఇంకా మానవత్వం ఉందని నిరూపించింది ఓ మాతృమూర్తి. తాను చనిపోతానని తెలిసి తన అవయవాలతో కొందరైనా ప్రాణాలతో ఉంటారని.. మరణించిన తర్వాత తన అవయవాలు దానం చేయడానికి సిద్ధమైంది. ఉండవల్లి మండలం బొంకూరుకు చెందిన నర్సుబాయి (55), భర్త తులసీరాం, కుమారుడు కృష్ణాజీరావు ఉన్నారు. గురువారం తన ఇంట్లో ప్రమాదవశాత్తు నర్సుబాయి కిందపడి తలకు గాయమైంది. దీంతో కుటుంబీకులు ఏపీలోని కర్నూల్ నగరంలో ఉన్న ప్రైవేట్ దవాఖానకు తరలించారు. బ్రెయిన్ డెడ్ అయిందని రెండ్రోజులు వైద్యులు చికిత్స అందించారు. అయినా ఫలితం లేదని వైద్యులు చెప్పడంతో తన శరీరంలోని అవయవాలు కొందరికి ఉపయోగపడతాయని నర్సుబాయి చెప్పిన మాట మేరకు అవయవాలు దానం చేయడానికి కుటుంబ సభ్యులు సిద్ధమయ్యారు. దీంతో ఆదివారం నర్సు తుది శ్వాస విడిచారు. దీంతో కర్నూల్‌లోని కిమ్స్ దవాఖాన వైద్యులు మహిళ శరీరంలోని అవయవాలను తీసి భద్రపరిచి భౌతికకాయాన్ని కుటుంబ సభ్యులకు అప్పజెప్పగా సొంతూరుకు తీసుకెళ్లారు. కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు అంతిమ యాత్రలో కన్నీటి వీడ్కోలు పలికారు. అవయవాలతో ఆరుగురి ప్రాణాలు కాపాడుతున్నామని కిమ్స్ వైద్యులు తెలిపారు.

## కూచిపూడిలో గిన్నిస్ వరల్డ్ రికార్డు

- మెడల్ అందుకున్న నారాయణపేట కళాకారిణి

నారాయణపేట, ఏప్రిల్ 28 : పేట పట్టణానికి చెందిన మానసవీణ కూచిపూడి నృత్యంలో ప్రతిభ కనబరిచి గిన్నిస్ బుక్ వరల్డ్ నుంచి మెడల్, ప్రశంసాపత్రం అందుకున్నది. 2023 డిసెంబర్ 23వ తేదీన హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో గిన్నిస్ వరల్డ్ రికార్డ్ కూచిపూడి లార్జెస్ట్ లెసన్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన 4,768 మంది కూచిపూడి కళాకారులు పాల్గొనగా.. వీరిలో నారాయణపేటకు చెందిన మల్లికార్జున్, రజిత దంపతుల కూతురు మానసవీణ ప్రతిభ చాటింది. ఇందుకుగానూ గిన్నిస్ బుక్ వరల్డ్ నుంచి మెడల్, ప్రశంసాపత్రాన్ని పోస్టు ద్వారా అందుకున్నది.



ప్రశంసాపత్రం, మెడల్‌తో మానసవీణ

## చేనేత కార్మికురాలికి స్త్రీశక్తి అవార్డు




అవార్డు అందుకుంటున్న రాజోళి పద్మ

రాజోళి, ఏప్రిల్ 28 : చేనేత రంగంలో రాణిస్తున్న జోగులాంబ గద్వాల జిల్లా రాజోళి మండల కేంద్రానికి చెందిన పద్మ రాష్ట్రస్థాయి స్త్రీ శక్తి అవార్డుకు ఎంపికైంది. చేనేత రంగంలో గద్వాల అంచు చీరలు నేస్తూ వ్యాపార రంగంలో రాణించడంతో చేనేత సంబంధిత అధికారులు గుర్తించి సోమవారం హైదరాబాద్‌లో మంత్రి సీతక్క చేతుల మీదుగా ఆమెకు అవార్డు ప్రదానం చేశారు.

## వడ్లు తడుస్తుంటే చోద్యం చూస్తుండ్రు

- మక్తల్ రాస్తారోకోలో అధికారులపై రైతుల ఆగ్రహం
- గన్నీ బ్యాగులు ఇవ్వాలని డిమాండ్
- రాయిచూర్ హైవేపై బైఠాయింపు
- సీఐ హామీతో ధర్నా విరమణ

మక్తల్, ఏప్రిల్ 28: యాసంగిలో పండించిన వడ్లను అమ్ముకునేందుకు అన్నదాతలు తిప్పని పరిస్థితుల్లో రోడ్డెక్కాల్సిన దుస్థితి నెలకొన్నది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకురావాలంటే గన్నీబ్యాగులు లేక కల్లాలపైనే ధాన్యం అకాల వర్షాలకు తడుస్తున్నా.. అధికారులు గన్నీ బ్యాగులు ఇవ్వకుండగా చోద్యం చూస్తున్నారని విసుగుచెంది సోమవారం మధ్యాహ్నం జాతీయ రహదారి పై భారీ ఎత్తున రాస్తారోకో చేపట్టారు. మక్తల్ మండలంలోని వివిధ గ్రామాల రైతులు గన్నీ బ్యాగుల కోసం సోమవారం ఉదయం మక్తల్ పీఏసీఎస్ రాగా.. కార్యాలయ సిబ్బంది రైతులకు గన్నీ బ్యాగులు ఇవ్వకుండా నిర్లక్ష్యం వహించడంతో అధికారుల తీరుకు నిరసనగా.. కార్యాలయం ఎదుటే జాతీయ రహదారిపై ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతుల పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రతిగింజను కొంటామంటూ ఊకదుంపుడు మాటలు మాట్లాడి తీరా గన్నీ బ్యాగులను అందించకుండా నిర్లక్ష్యం వహించడంతో ఆదివారం కురిసిన వర్షానికి భారీమొత్తంలో ధాన్యం తడిసి ముద్దయిందని వాపోయారు. అధికారులు రైతులకు తేదీలవారీగా టోకెన్లను జారీచేసి సంచులు ఇవ్వాల్సి ఉండగా.., ఇందుకు విరుద్ధంగా పీఏసీసీఎస్ సిబ్బంది కాసులకు కక్కుర్తి పడి, అవసరమైన పెద్దపెద్ద రైతులకు రహస్యంగా గన్నీ బ్యాగులను తరలించడంతో మిగతా రైతులకు బ్యాగులు అందకుండా పోతున్నాయని ఆరోపించారు. పెద్ద రైతులకు మాత్రమే గన్నీ బ్యాగులను ఇస్తుండడంతో కల్లాల్లో ఉన్న సన్నచిన్నకారు రైతుల ధాన్యం వర్షానికి తడిసి ముద్దవుతున్నా.. కొనుగోలు కేంద్రాల సిబ్బంది ఏమాత్రం చర్యలు చేపట్టకుండా రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని భీష్మించుకూర్చున్నారు. దీంతో జాతీయ రహదారిపై భారీ ఎత్తున ట్రాఫిక్ నిలిచిపోవడంతో మక్తల్ సీఐ రామలాల్ హుటాహుటిన సిబ్బందితో ధర్నా స్థలానికి చేరుకొన్నారు. రైతులను సమదాయించినప్పటికీ రైతులు ఏమాత్రం తగ్గకుండా.. గన్నీ బ్యాగులు వచ్చేంతవరకు రాస్తా రోకో విరమించేది లేదని పేర్కొన్నారు. దీంతో సీఐ జిల్లా కేంద్రంలోని ఉన్న తాధికారులతో మాట్లాడి రైతులకు కావాల్సిన గన్నీ బ్యాగులను అందించే విధంగా చర్యలు చేపడుతామని అధికారులు హామీ ఇచ్చారని రైతులకు సూచించడంతో.. సీఐ హామీ మేరకు ధర్నా విరమించారు. మక్తల్ మండలంలో రైతులకు నాలుగున్నర లక్షల గన్నీ బ్యాగులు అవసరం ఉండగా, కేవలం కార్యాలయంలో 25వేల గన్నీ బ్యాగులు మాత్రమే ఉన్నాయని, ఈ గన్నీ బ్యాగులను ఎవరికి ఇవ్వాలో అర్థంకాక కార్యాలయంలోనే ఉంచినట్లు సిబ్బంది తెలిపారు.



మక్తల్‌లో గన్నీబ్యాగులు ఇవ్వాలని జాతీయ రహదారిపై రాస్తారోకో చేపట్టిన రైతులు



పీఏసీసీఎస్‌లో ఉంచిన గన్నీ బ్యాగులు

## గన్నీ బ్యాగులు ఇప్పించండి మహాప్రభో..

- తడిచిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి
- ఎమ్మెల్యే, కలెక్టర్‌కు విన్నవించిన రైతులు



మాగనూరు రైతువేదికలో సమస్యలపై కలెక్టర్, ఎమ్మెల్యేను నిలదీస్తున్న రైతులు

మాగనూరు, ఏప్రిల్ 28 : ఉమ్మడి మండలంలో గన్నీ బ్యాగుల్లేక రైతులు నానా కష్టాలు పడుతున్నారని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, కలెక్టర్ సిక్తాపట్నాయక్‌కు ఉమ్మడి మాగనూరు మండల రైతులు మొరపెట్టుకున్నారు. మాగనూరు, కృష్ణ మండల కేంద్రాల్లో సోమవారం భూభారతిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయా మండల కేంద్రాల్లోని రైతు వేదికల్లో నిర్వహించిన అవగాహన సదస్సుకు కలెక్టర్, మక్తల్ ఎమ్మెల్యే ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కలెక్టర్ కి ఉమ్మడి మండలాల రైతులు తమ సమస్యలను వినిపించారు. ప్రధానంగా మాగనూరు మండలంలో 14 వేల ఎకరాలు, కృష్ణా మండలంలో 12,500 ఎకరాల్లో వరిధాన్యం పండించిన రైతులకు దాదాపు 15లక్షల గన్నీ బ్యాగులు రావాల్సి ఉండగా ఇప్పటి వరకు అధికారులు సగానికిసగం కూడా సరఫరా చేయలేదని వాపోయారు. అధికారులు తమకు గన్నీ బ్యాగులు అందించక పోవడంతో పండించిన ధాన్యాన్ని వారం రోజులుగా కల్లాల్లోనే ఆరబెట్టామని, కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యం ఆదివారం కురిసిన అకాల వర్షానికి తడిసి ముద్దయిందని, తడిసిన ధాన్యాన్ని తక్షణమే ప్రభుత్వం కొనుగోలు చేసి తమకు న్యాయం చేయాలని కోరారు. అలాగే రైతులకు లారీలు పంపించాలంటే లారీ యజమానులు, డ్రైవర్లకు మూడు నుంచి ఐదువేలు కచ్చితంగా ఇవ్వాల్సిందేనని.. లేదంటే ఎవరిస్తే వారికి మాత్రమే వెళ్తారని ఆరోపించారు. లారీల కొరతతో రైతులు ఇంకా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి మండలంలో 64 లారీలు మాత్రమే ఉన్నాయని వాటిని యజమాని ఇష్టానుసారంగా వాళ్లకు తెలిసిన వారికి మాత్రమే పంపుతున్నారని కలెక్టర్‌కు వివరించారు. రైతుల విన్నపాలకు స్పందించిన కలెక్టర్ వర్షానికి తడిసిపోయిన ధాన్యం కొనుగోలు చేసే విషయమై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తగిన న్యాయం చేసేందుకు కృషిచేస్తామని హామీ ఇచ్చారు. 64లారీలు సరిపోకపోతే ఇంకా కొన్ని లారీలు కేటాయించే విధంగా చర్యలు చేపడుతానని రైతుల నుంచి డబ్బులు డిమాండ్ చేస్తే, ధాన్యం సేకరించడంలో రైతుకి ఎలాంటి ఇబ్బందులున్నా.. హెల్ప్‌లైన్ నెంబర్ 9963471959కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. సమావేశంలో నారాయణపేట ఆర్డీవో రాంచందర్, ట్రైనీ కలెక్టర్ ప్రణయ్ కుమార్, మాగనూరు, కృష్ణ తాసీల్దార్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.